క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు (బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూ బస్‌స్టేషన్ రోడ్ ప్రాంతంలో ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు, కాజీపేట విష్ణుపురి కాలనీ, సోమిడి ప్రాంతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని ఇండస్ట్రీయల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ అశోక్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ అంతరాయం ఉంటోందన్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

శివకుమార్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి: మండలంలోని సిద్దాపురం గ్రామానికి చెందిన బొల్ల పెల్లి శివకుమార్ డాక్టరేట్ పట్టా అందుకున్నా డు. ఉస్మానియా యూ నివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. 'అగ్రికల్చర్ , ఇరిగేషన్, అగ్రోబేసెడ్ ఇండస్ట్రీస్ హైదరాబాద్ స్టేట్ 1853–1948 ఏ స్టడీ' అనే అంశంపై పరిశోధనాత్మక వ్యాసాన్ని సమర్పించారు. డాక్టర్ పి.రమేష్ పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్ : వరంగల్ నగర పరిధి ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ (దేశాయిపేట) పరిధిలో నేడు (బుధవారం) నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిల్టర్‌బెడ్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పైపులైన్ల మరమ్మతు పనులతో పాటు లీకేజీలు అరికట్టే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అంతరాయానికి ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు 'చెకుముకి' సంబురాలు

నయీంనగర్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబురాలు రేపు (గురువారం) ఉనికిచర్ల శ్రీనివాస రామానుజన్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞాన వేదిక ఒక ప్రకటనలో తెలిపింది. మండల స్థాయి నుంచి జిల్లాకు ఎంపికైన విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకావాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులకు డిసెంబర్ 14, 15, 16న ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతి



తిరుపతి రమేశ్

విద్యారణ్యపురి : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ జిల్లాకు చెందిన నన్నబోయిన తిరుపతి ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా రావుల రమేష్ ఎన్నికయ్యారు. టీపీటీఎఫ్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశ ఈనెల 25న హైదరాబాద్‌లోని అబిడ్స్‌లోని ఫరహాన హౌజ్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఇద్దరికి చోటు లభించింది. నూతన అధ్యక్షుడిగా అనిల్‌కుమార్ ఎన్నికగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నన్నబోయిన తిరుపతి హనుమకొండ నడికూడ జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై న రావుల రమేష్ కొకొండ ఎంపీపీఎస్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్నారు. తిరుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

ప్రత్యేక అలంకరణలో అంజన్న



కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో మంగళవారం దక్షిణ ముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవ చివరి మంగళవారం వేడుకలను పురస్కరించుకుని ఆంజనేయుడికి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. స్వామివారిని వడమాలతో పాటు నూతన వస్త్రాలతో అలంకరించారు.

గుప్పుమంటున్న గుడుంబా

- పల్లెల్లో తయారీ.. పట్టణాల్లో విక్రయాలు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- పట్టించుకోని పోలీసులు



కాశిబుగ్గ : నగరంలో గుడుంబా గుప్పుమంటోంది. పలు కాలనీల్లో యథేచ్ఛగా గుడుంబా అమ్మకాలు జరుగుతున్నాయి. అయినా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడుంబా తాగిన ప్రజలు అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నారు. పల్లెలో తయారవుతూ పట్టణాల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. వరంగల్ పరిసర ప్రాంతాలైన గీసుకొండ, సూరపల్లిలో గుడుంబా తయారు చేస్తూ ఆటోల్లో ప్రత్యేక ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి వరంగల్ పట్టణానికి తరలించి అమ్మకాలు చేస్తున్నారు. నగరంలోని జాన్‌కాక గోదాముల (గొర్రెకుంటరోడ్డులో), అబ్బనికుంట వడ్డెరవాడ, లేబర్‌కాలనీ శ్మశానవాటిక తదితర ప్రాంతాల్లో కొంత మంది షాపులు ఏర్పాటు చేసి గుడుంబా విక్రయిస్తున్నారు. మద్యంతో పోలిస్తే గుడుంబా తక్కువ ధరలో లభ్యం కావడంతో పెద్ద ఎత్తున అందరూ గుడుంబానే సేవిస్తున్నట్లు తెలుస్తోంది. గుడుంబా రూ. 20, 30 ప్యాకెట్లలో తయారు చేస్తూ అమ్మకాలు జరుపుతున్నారు. కొంత మంది యువకులు సైతం గుడుంబాను కూల్‌డ్రింక్‌ల్లో కలుపుకొని తాగుతున్నారు. క్రిస్టియన్‌కాలనీలో ఇటీవల ఒకరు మత్యువాత పడ్డారు. లేబర్‌కాలనీ శ్మశానవాటిక ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా అమ్మకాలు జరుపుతుండడంతో తాగిన యువకులు చెన్నారెడ్డికాలనీ పంచముఖ నాగవీరేశ్వరాలయం జంక్షన్‌లో అడ్డాలు పెట్టి రోడ్డుపై రాకపోకలు సాగించే వారిపై టీజింగ్‌కు దిగుతున్నారని అక్కడి స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడుంబా తాగి చాలామంది లేబర్ కాలనీ శ్మశానవాటికలో విశ్రాంతి తీసుకుంటున్నారని స్థానికులు తెలుపుతున్నారు. పోలీసులు స్పందించి నగరంలో గుడుంబా అమ్మకాలపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు

హసన్‌పర్తి : వర్ధన్నపేట నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు వర్ధన్నపేట ఎమ్మెల్మే కే.ఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని సూదన్‌పల్లిలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం, మడిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులతో పాటు రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. వచ్చే నెలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6లక్షలు, బీసీతో పాటు ఇతరులకు రూ.5లక్షల అందజేస్తామన్నారు.

త్వరలోనే అందరికీ రుణమాఫీ

సాంకేతిక కారణాల వల్ల పలు సొసైటీల్లో రుణమాఫీ జరగలేదని ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. అయితే త్వరలోనే వారందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ కానీ రైతులు ఆందోళనకు గురికావొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, స్పెషల్ ఆఫీసర్‌లు ఎం.డి. రహీం, అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ తిరుపతి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, చిర్ర సుమలత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, గడ్డం శివరాంప్రసాద్, నాయకులు విజయ్‌కుమార్, రామంచ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నిర్మాణ బాధ్యులు రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న పంజాల రమేశ్

ఖిలా వరంగల్: బీసీల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలు, చట్ట సభల్లో విద్యా, ఉపాధి అవకాశాలల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నిర్మాణ బాధ్యులు పంజాల రమేశ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషమియా, చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో బీసీ హక్కుల సాధన సమితి మండల ప్రతినిధి ఓర్స్ రాజు అధ్యక్షతన బీసీల రిజర్వేషన్లు,హక్కులు అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. బీసీల హక్కుల కోసం బీసీలంతా రాజకీయాలకు అతీతంగా, మతాలకతీతంగా ఐక్య పోరాటాలు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల హక్కుల కోసం భవిష్యత్తులో పోరాటలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో చీకటి ప్రకాశ్, సువర్ణ, శారద, సౌందర్య, సాంబయ్య, స్వామి, సౌందర్య, అనిల్, కిరణ్‌కుమార్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగ్‌పూర్ సమావేశానికి తరలిన రైల్వే నాయకులు

కాజీపేట రూరల్ : నాగ్‌పూర్ అజ్నీ రైల్వే స్టేడియంలో మంగళవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు తరలివెళ్లారు. అసోసియేషన్ జాతీయ నేతలు బి.ఎల్.బైరవా, అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగ దినత్సోవంలో సికింద్రాబాద్ డివిజన్ నేతలు ఎఆర్.రాజశేఖర్, బి.వీరన్న, కె.ఎస్.రావు, కాజీపేట నాయకులు ఆర్.కుమారస్వామి, ఎం.ఎల్.నారాయణ, ఎల్.వెంకట్, బిక్షపతి, బాలరాజు, హరిబాబు, జక్రియ, నరేష్ , ధన్‌రాజ్, కాజీపేట నుంచి ఆరు బ్రాంచీల నుంచి 200 మంది నాయకులు తరలివెళ్లారు.

రైల్వేమంత్రికి వినతి

రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేగ్‌వాల్‌ను కలిసి రైల్వే ఎస్సీ ఎస్టీ కార్మికుల సొలభ్యాలపై వివరించినట్లు కె.ఎస్.రావు తెలిపారు.

రాత్రివేళ వరుస దొంగతనాలు

కాశిబుగ్గ : కాశిబుగ్గలో రాత్రి వేళ దొంగలు వరుస దొంగతనాలకు ప్రయత్నిస్తున్నారు. బయట ఉన్న బైకులు, బైకుల్లో పెట్రోల్‌ను దొంగతనం చేస్తున్నారు. ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈనెల 20న కాశిబుగ్గలోని ఓ ఉల్లిగడ్డల షాపు ముందు పార్కింగ్ చేసి ఉన్న ఓ బైక్‌ను గుర్తుతెలియని దొంగలు వచ్చి తీసుకొని వెళ్లారు. అలాగే మంగళవారం తెల్లవారు జామున కూరపాటి పెంటయ్య కిరాణం షాపులో చోరీ చేయుటకు షట్టర్ తాళం తీయుటకు ఇద్దరు వ్యక్తులు యత్నించారు. ఈ ఘటనలు సమీపంలోని సీసీ కెమెరాలలో రికార్డయ్యాయి. రాత్రి వేళల్లో పో లీసులు పెట్రోలింగ్ చేయకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని కాశిబుగ్గ వాసులు అంటున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సొసైటీ బృందం

కాజీపేట రూరల్ : కాజీపేట దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం హండ్రెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి పేద విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్ఎం ఎస్.ఎం.ఎం.స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ నిర్వాహకులు రా.దాక్కృష్ణ, కె.సత్యనారాయణ, ఆడెపు రాజన్‌బాబు, రవిప్రసాద్, రామచందర్, భీమన్న, బోయ చందులు కలిసి స్టడీ మెటీరియల్‌ను 21 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అద్దగట్ల విజయ్, నాగార్జున, రమేష్, స్టాఫ్ సెక్రటరీ కటుకూరి శ్రీనివాస్, బి.సతీష్‌పాల్, ఎం.సుమలత, బి.సునీత, టి.రాంగోపాల్, రాహుల్ పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

ఖిలా వరంగల్: ఈనెల 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట నాని గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన జరిగిన దీక్షా దివస్ కార్యక్రమ సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వచ్చి సంబురాలు జరుపుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, టి.రమేష్‌బాబు, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, కార్యకర్తలు పాల్గొన్నారు

సఖి సెంటర్‌తో మహిళలకు భరోసా

హన్మకొండ: సమస్యల్లో ఉన్న మహిళలు సఖి సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సఖి సెంటర్ అడ్మిన్ ఎస్.హైమావతి అన్నారు. మంగళవారం సుబేదారిలోని రెసో మెడికాన్ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. హైమావతి, కేసు వర్కర్ హరిత మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలకు సఖి సెంటర్ సహాయం అందిస్తుందన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తక్షణ సహాయానికి టోల్ ఫ్రీ నంబర్ 181కు, 0870–2452112 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవిష్ణు కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న స్వాములు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని శ్రీహరిహరపుత్ర శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో 30వ మండల పూజ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవిష్ణు కల్యాణం శ్రీదేవి భూదేవి సమేత మహావిష్ణు వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం అయ్యప్పలకు, భక్తులకు అన్నదానం జరిగింది.

అన్నదానం

కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. దాత రాజు సహకారంతో 160 మందికి అన్నదానం చేసినట్లు కమిటీ వారు తెలిపారు.

శాస్త్రోక్తంగా శ్రీఅనఘాష్టమి వ్రతం

ఖిలా వరంగల్: కార్తీక మాసం సందర్భంగా మంగళవారం వరంగల్ శివనగర్ శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణం శ్రీరామలింగేశ్వరస్వామి సన్నిదిలోని ఉసిరి చెట్టున శ్రీఅనఘాష్టమి వ్రత పూజ నేతపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర చార్యులు , ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అనఘాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. ఆలాగే శ్రీరామలింగేశ్వరస్వామి పూలతో ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

16నుంచి ధనుర్మాస కార్యక్రమాలు



రామన్నపేట : డిసెంబర్ 16 నుంచి జనవరి 14 వరకు మట్టెవాడలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, కృష్ణమాచార్యులు తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. వేణుగోపాలస్వామి దేవాలయంలో కార్తీక ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం శ్రీ రమా రహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ రామాచార్యులు, కృష్ణమాచార్యులు తెలిపారు.

వేంకటేశ్వరాలయంలో..

వరంగల్ చౌరస్తా : వరంగల్ రామన్నపేట బట్టలబజార్‌లోని బాలానగర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఉదయం అభిషేకం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత వైభవోపేతముగా జరిగాయి. సూమారు వంద మంది దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై..

మడికొండ : గ్రేటర్ వరంగల్‌లోని 46వ డివిజన్ మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసంను పురస్కరించుకొని మంగళవారం సాముహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్ : ఖిలావరంగల్ పడమరకోటలో శ్రీలక్ష్మీ, మహాలక్ష్మి దేవీ బొడ్రాయి ప్రతిష్ఠాపన పంచమ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. బొడ్రాయి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఇనుముల మల్లేశం, స్థానిక కార్పొరేటర్లు ఉమ, సువర్ణ ఆధ్వర్యంలో వేదపండితుల బృందం నేతృత్వంలో బొడ్రాయికి విశేష పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ బొడ్రాయిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లేశం అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



వరంగల్ చౌరస్తా : ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు



ఖిలావరంగల్ : శివనగర్‌లో అనఘాష్టమి వ్రతం చేస్తున్న మహిళలు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

హసన్‌పర్తి: నినాదాలు చేస్తున్న నాయకులు



కేయూ క్యాంపస్: దూరవిద్యా కేంద్రం వద్ద..



మడికొండ: రాంపూర్‌లో..



రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, మడికొండ, వరంగల్, తదితర ప్రాంతాల్లో 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై మాట్లాడుతూ ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని మనువాదుల కుట్రల నుంచి రక్షించుకోవాలని అన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మా ట్లాడుతూ ఈ దేశ మూల వాసులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు, భారత భూమిపై ఉన్న ప్రతీ జీవి, నిర్జీవికి రక్షణ, స్వేచ్ఛ, సమాన హక్కులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగం ద్వారా కల్పించారన్నారు. కార్యక్రమాల్లో పలు సంఘాల నాయకులు, ప్రొఫెసర్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, అంబేడ్కర్ యువజన, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి,నెట్‌వర్క్



హనుమకొండ: రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు



వరంగల్ అర్బన్ : బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో..



కాజీపేట: ర్యాలీ నిర్వహిస్తున్న తేజోమాయి సంక్షేమ సంఘం సభ్యులు



హనుమకొండ: ప్రతిజ్ఞ చేస్తున్న రావు పద్మ, పార్టీ నాయకులు



వరంగల్ లీగల్: మాట్లాడుతున్న జీవన్‌గౌడ్



హన్మకొండ కల్చరల్: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూక్య బాబురావు



కాజీపేట రూరల్: రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఖిలా వరంగల్: ఆకేరు వాగు నుంచి అక్రమంగా నగరానికి తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వర్ధన్నపేట ఆకేరువాగు నుంచి వరంగల్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఆవరణకు తరలించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన సోదామని ఇటీవల గుండె పోటుతో మరణించగా ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెలే అరూరి రమేశ్ మంగళవారం పరామర్శించారు. మృతురాలి కుమారుడు కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డిలను ఓదార్చారు. అలాగే అనారోగ్యానికి గురై మరణించిన సీతానాగారానికి చెందిన పెద్ది రాజిరెడ్డి కుటుంబాన్ని అరూరి ఓదార్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్లు జక్కు రమేశ్, బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థిని ప్రతిభ



శ్రీకృతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మత్యాస్‌రెడ్డి, డైరెక్టర్ సునీతారెడ్డి

హన్మకొండ : ఎన్‌టీపీసీ వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలో హనుమకొండ హౌసింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని శ్రీకృతి నగదు బహుమతి గెలుచుకుంది. జూనియర్ విభాగంలో 6వ తరగతి చదువుతున్న శ్రీకృతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రూ.9500 నగదు, గిఫ్ట్ హ్యాంపర్స్ బహుమతులు గెలుచుకున్నారు. విద్యార్థినిని, డ్రాయింగ్ టీచర్ రాపోలు శ్రీనివాస్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ గోపు మత్యాస్‌రెడ్డి, డైరెక్టర్ గోపు సునీతారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.